క్లుప్తంగా

సోలార్ లైట్లు మంజూరు చేయండి


ఎంపీ రంజిత్‌రెడ్డితో సర్పంచ్ హైదర్

పెద్దేముల్: రెగోండి గ్రామ పంచాయతీకి సోలార్ లైట్లు మంజూరు చేయాలని కోరుతూ సర్పంచ్ హైదర్.. ఎంపీ రంజిత్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి రెండు కిలో మీటర్ల దూరంలో రుక్మాపూర్ రైల్వేస్టేషన్ ఉందని, సుమారు పది గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని, రాత్రి వేళల్లో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ఎంపీ కోటా నుంచి సోలార్ లైట్లు మంజూరు చేయాలని కోరారు. ఈ విషయాన్ని పలుమార్లు మండల సర్వసభ్య సమావేశంలో చెప్పామని తెలిపారు. ఇందుకు ఎంపీ.. సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ తెలిపారు.

సీహెచ్‌ఓగా విజయ్‌కుమార్



బంట్వారం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బంట్వారం సీహెచ్ఓగా విజయ్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఈ పోస్టు చాలా కాలంగా ఖాళీగానే ఉండగా.. వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు మోమిన్‌పేట పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న విజయ్‌కుమార్‌ను పదోన్నతిపై సీహెచ్‌ఓగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎక్కడ పని చేసినా అంకిత భావంతో విధులు నిర్వహిస్తానని, మండల ప్రజలు వైద్య సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

'మనఊరు' పనుల్లో అధికారుల నిర్లక్ష్యం


ఎంఈఓకు ఫిర్యాదు చేస్తున్న పీఎస్‌పీఎస్ సంఘం నేతలు

కుల్కచర్ల: మనఊరు–మనబడి అభివృద్ధి పనుల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండల పీఎస్‌పీఎస్ సంఘం అధ్యక్షుడు హరికృష్ణ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ హబీబ్ అహ్మద్‌కు మనఊరు–మనబడి అధికారులపై ఫిర్యాదు చేశారు. పనులు నిర్వహించేందుకు పాఠశాల యాజమాన్య కమిటీలు ఉత్సాహాన్ని చూపిస్తున్నప్పటికీ.. సంబంధిత అధికారులు మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. పనులు కొంతవరకే చేపట్టడం వలన విద్యార్థులు ఇబ్బందికి గురౌతున్నారని వాపోయారు. అధికారుల తీరు మార్చుకొని, పనుల నిర్వహణలో వేగాన్ని పెంచేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం

దౌల్తాబాద్: నీటూరు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో తలారి మొగులప్ప, హన్మంతు పొలంలో జొన్నపంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ లావణ్య మాట్లాడుతూ రైతులు పంటకోత ప్రయోగంతో అధిక దిగుబడి సాధించవచ్చని చెప్పారు. పంటకోత ద్వారా సరాసరి దిగుబడిని నిర్ధారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీపతిరెడ్డి, వీఆర్ఏ సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

నిధుల్లేవు.. ప్రాధాన్యత లేదు

- నాలుగేళ్లలో వచ్చినవి రూ.5 లక్షల లోపే!
- ప్రజల మధ్య తిరగలేక పోతున్నం
- ఉత్సవ విగ్రహాలుగా మారినం: ఎంపీటీసీలు


దౌల్తాబాద్ ఎంపీడీఓ కార్యాలయం

దౌల్తాబాద్: గత ఎన్నికల ప్రచార సమయంలో తమను గెలిపిస్తే గ్రామాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని ప్రజలకు హామీఇచ్చారు. ఏ సమస్య ఉన్నా పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కానీ ఇప్పుడు ఆ ప్రజాప్రతినిధులకే నిధులు రాక ఇబ్బందులు పడుతున్నారు. తమను గెలిపించిన ప్రజలు అభివృద్ధిపై ప్రశ్నిస్తే ఏం సమాధానం చెప్పాలో తెలియడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధులు లేకపోవడంతో పాటు.. తమకు ప్రాధాన్యం లేకుండా పోయిందని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులం అన్న మాటే తప్ప.. ఎందుకు పనికిరాకుండా మిగిలిపోతున్నామని చెప్పారు. కొడంగల్ నియోజకవర్గంలో 40మంది ఎంపీటీసీలు ఉన్నారు. ఎంపీటీసీలకు గత నాలుగేళ్లుగా వచ్చిన నిధులు కేవలం రూ.5 లక్షల లోపు మాత్రమే. ఈ ఐదు లక్షలతో గ్రామాల్లో ఏం అభివృద్ధి చేస్తామని వారు ప్రశ్నిస్తున్నారు. గెలిచిన వారిలో ఎక్కువ మంది ఆర్థికంగా వెనుకబడిన వారే ఉన్నారు. ప్రభుత్వం నిధులు అందించకపోవడంతో ఇబ్బందులు పడుతూ.. ప్రజల్లో తిరగలేకపోతున్నారు.

ఆశించినంత రాక..

పరిషత్ ఎన్నికలు జరిగి నాలుగేళ్లవుతోంది. గతంలో జెడ్పీల ద్వారా గ్రామాలకు నిధులు అందేవి. కానీ 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు జెడ్పీల నుంచి రాకుండా నేరుగా పంచాయతీలకు చేరుతుండడంతో పరిషత్తుల ప్రాధాన్యం కోల్పోయింది. ప్రస్తుత విధానంలో ఆర్థిక సంఘం ద్వారా 80శాతం నిధులు గ్రామ పంచాయతీలకు, మండల పరిషత్‌లకు 15శాతం, జిల్లా పరిషత్‌లకు 5శాతం కేటాయింపులు జరుగుతున్నాయి. ఈ లెక్కన ఒక్కో జెడ్పీటీసీకి ఏడాదికి రూ.5నుంచి రూ.10లక్షలు రావాల్సి ఉంది. కానీ ఆ విధంగా నిధులు రావడంలేని ఆయా ప్రజాప్రతినిధుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎంపీటీసీ సభ్యులకు 15వ ఆర్థిక సంఘం స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నారు. అయినప్పటికీ వారికి ఆశించిన నిధులు రావట్లేదనే అసంతృప్తితో ఉన్నారు. పేరుకే ప్రజాప్రతినిధులం కానీ.. ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోతున్నామని ఆవేదన చెందుతున్నారు.

ఇదేనా గౌరవం



ఎంపీటీసీలుగా గెలిచి నాలుగేళ్లవుతోంది. ఇప్పటి వరకు కేవలం రూ.4 లక్షలతో మాత్రమే పనిచేశాను. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుదామంటే నిధులు లేవు. ఎంపీటీసీలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా? గ్రామాల అభివృద్ధికి తక్షణమే నిధులు మంజూరు చేయాలి.

– కుర్మని మంజుల, ఎంపీటీసీ, దౌల్తాబాద్

ప్రభుత్వ భూములు కాపాడుతాం

- అక్రమ మైనింగ్, ఇసుక రవాణా చేస్తే చర్యలు
- ప్రజావాణిలో తహసీల్దార్లు


తాండూరు రూరల్: ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నప్పల నాయుడు

తాండూరు రూరల్: ప్రభుత్వ భూములను కాపాడుతామని తహసీల్దార్ చిన్నప్పల నాయుడు అన్నారు. ప్రజావాణిలో భాగంగా సోమవారం తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడారు. ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న ఫిర్యాదులను త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వ భూముల్లో అక్రమ మైనింగ్, ఇసుక రవాణా చేస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెండు ఫిర్యాదులు..

పెద్దేముల్: తహసీల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు అందాయని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి తెలిపారు. భూ సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరు.. ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో మంబాపూర్, గోపాల్‌పూర్ గ్రామాల నుంచి పట్టా మార్పిడి, పట్టా పాస్ బుక్ కోసం రెండు ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు.

'సోషల్ టీచర్‌ను నియమించండి'


ఎంఈఓతో మాట్లాడుతున్న కౌన్సిలర్ బొంబినా

తాండూరు రూరల్: పట్టణంలోని మాణిక్‌నగర్ నం.2 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌ను నియమించాలని 14వ వార్డు కౌన్సిలర్ బొంబినా కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ వెంకటయ్యను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానిక నం.2 ఉన్నత పాఠశాలలో ఏడాది నుంచి విద్యార్థులకు సామాజికశాస్త్రం పాఠం చెప్పడంలేదన్నారు. పాఠశాలలో 6,7వ తరగతికి క్లాసులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఇలా అయితే పరీక్షలు ఎలా రాయాలని ఎంఈఓను ప్రశ్నించారు. కనీసం పాఠశాలకు వెళ్లి విద్యార్థులు ఎలా చదువుతున్నారు? ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి, ఉపాధ్యాయులు ఉన్నారా లేరా? అని తనిఖీ చేయాలని ఎంఈఓకు సూచించారు. అనంతరం స్పందించిన ఎంఈఓ వెంటనే పాఠశాల హెచ్ఎంకు ఫోన్ చేసి 6,7 తరగతుల విద్యార్థులకు సోషల్ క్లాసులు ఎందుకు చెప్పడంలేదని ప్రశ్నించారు. ఓ ఎస్టీటీ టీచర్‌ను రేపటి నుంచి తరగతులు చెప్పేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు శివలీల తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ సత్యహరిశ్చంద్ర

కుల్కచర్ల: బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ.. బాలల హక్కులను కాపాడటం, ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను రక్షించడం వంటి అంశాలను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూళన, బాల్యవివాహాల నిరోధానికి అవసరమైన సలహాలు, సూచనలు చేయడం వంటివి చేస్తూ బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్ కుమార్, ఎంఈఓ హబీబ్ అహ్మద్, సీహెచ్‌ఓ చంద్రప్రకాష్, చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, చైల్డ్‌లైన్ మండల కోఆర్డినేటర్ రాంచంద్రయ్య, ఆయా వసతిగృహాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- గిరిజన విద్యార్థులపై పెరుగుతున్న దాడులను అరికట్టాలి
- ప్రీతి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం: నేతలు


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న బంజారా సంఘం నాయకులు

తాండూరు: మెడికో విద్యార్థిని ప్రీతి మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలంటూ తాండూరు పట్టణంలో బంజారా, బీసీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ఇందిరాచౌక్ వద్ద ప్రీతి చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బంజారా సంఘం నేత, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ జాదవ్ మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులు ఇప్పుడిప్పుడే ఉన్నత విద్యకు చేరువవుతున్న సమయంలో ఇలా దాడులు జరుగుతుండడం బాధాకరమన్నారు. పక్షం రోజుల వ్యవధిలో ఇద్దరు గిరిజన బాలికలపై లైంగిక దాడులు జరిగాయని వాపోయారు. యాలాల మండలం పేర్కంపల్లి తండాలో పాఠశాల విద్యార్థినిపై లైంగిక దాడి మరువక ముందే మెడికో విద్యార్థిని ప్రీతిపై సీనియర్ల ర్యాగింగ్ ఆత్మహత్యకు పాల్పడేలా చేసిందని, చావు బతుకుల మధ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన బిడ్డలపై పెరుగుతున్న దాడులను అరికట్టి, ప్రీతి మరణానికి కారకులైన వారిని ఉరి తీయడంతో పాటు, ఆమె కుటుంబానికి రూ.5 కోట్ల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రీతి కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ భీంసింగ్ రాథోడ్, బంజారా సంఘం నాయకులు అనిల్‌రాథోడ్, గోపాల్ చౌహాన్, రాము జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమీక్ష

కొడంగల్: మంగళవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని రేవంత్ నివాసం వద్ద కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తెలిపారు. సమావేశంలో హాత్‌సే హాత్ జోడో యాత్ర, సభ్యత్వ నమోదు అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. గ్రామ కమిటీ అధ్యక్షులు, బూతు బాధ్యులు, పార్టీ మున్సిపల్ నాయకులు, కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు పాల్గొనాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ఎమ్మెల్యే ఆనంద్ కృషితో అభివృద్ధి

మోమిన్‌పేట: గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కృషితో జరుగుతున్నాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అంరాధికలాన్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ రూ.30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను సర్పంచు సుజాతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీల నిర్మాణంతో మట్టి రోడ్లు ఉండవన్నారు. ప్రభుత్వ నిధులతో గ్రామాలు స్వచ్ఛతను చాటుతున్నాయని, డంపింగ్ యార్డు, వైకుంఠధామం, క్రీడా ప్రాంగణం పనులను నిర్మించుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, ఉప సర్పంచు సలీం, వార్డు సభ్యులు, నాయకులు నాగభూషణం, నాగన్న, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మాంసం వ్యర్థాలు పారబోస్తే చర్యలు

- హోటళ్లు, మాంసం విక్రయదారులకు నోటీసులు
- వీధి కుక్కల నియంత్రణకు చర్యలు షురూ


వ్యాపారికి నోటీసు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తాండూరు టౌన్: మటన్, చికెన్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తే చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులు సదరు వ్యాపారులకు సోమవారం నోటీసులు జారీ చేశారు. ముఖ్యంగా రెస్టారెంట్లు, హోటళ్లు, మాంసం విక్రయించే వ్యాపారులు, ఫంక్షన్ హాల్ నిర్వాహకులు ఇష్టానుసారంగా, నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారవేస్తుండటంతో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్, ఆర్డీఓ అశోక్ కుమార్ వ్యాపారులను హెచ్చరిస్తూ నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు మున్సిపల్ సిబ్బంది నోటీసులను వ్యాపారులకు అందజేశారు. వీధి కుక్కల నియంత్రణలో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను పారవేయడాన్ని నిషేధించామని, ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఎస్‌డబ్ల్యూఎం-2016 చట్టం ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. మేరిన్ ఫుడ్స్ అండ్ ఫుడ్స్ నిర్వాహకులకు వ్యర్థాలను తరలించేందుకు అనుమతిచ్చామని, వారి వాహనాలకు వ్యర్థాలను అందజేయాలని సూచించారు.

పేదల సంక్షేమానికి కేంద్రం ప్రాధాన్యత


మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

కొందుర్గు: పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని బీజేపీ నేత శ్రీవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల గ్రామంలో సోమవారం నిర్వహించిన బీజేపీ కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి తామే చేస్తున్నామని బీఆర్ఎస్ గొప్పలు చెబుతుందే కానీ, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు నిధులన్నీ కేంద్ర ప్రభుత్వమే ఇస్తుందన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తామని ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. ప్రజలను మరోసారి మోసం చేయడానికి సిద్ధమవుతున్నారని ఆరోపించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయించి బిల్లులు అందక 9 మంది సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకోవడం జరిగిందని, ఈ పాపం బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, భూపాలచారి, కుర్మయ్య, శ్రీనివాసు, రామచంద్రయ్య, బీంరాజ్, అనంతయ్య పాల్గొన్నారు.

జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

షాబాద్: వాధ్యుల నుంచి జీవాలను కాపాడుకుందామని షాబాద్ పశువైద్యాధికారి డాక్టర్ ప్రవంతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కుర్వగూడ, బోడంపహాడ్, మాచన్‌పల్లి, అంతిరెడ్డిగూడ గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గొర్రెలు, మేకలకు ఏడాదికి మూడు సార్లు నట్టల మందులను తాపించాలన్నారు. జీవాలకు వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని సూచించారు.

సైఫ్‌కు ఉరేసరి..

మెడికల్ పీజీ విద్యార్థిని ధరావత్ ప్రీతి మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ నిరసనలు మిన్నంటాయి. ప్రజా, మహిళా, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో జిల్లాలో భారీగా ర్యాలీలు, ధర్నాలు చేశారు. రాజకీయాలతో ముడిపెట్టకుండా మెడికో విద్యార్థి మరణానికి ప్రత్యక్ష, పరోక్ష కారకులపై తగిన చర్యలు తీసుకోవాలని నినదించారు. సైకోగా మారి.. ఆమె చావుకు కారణమైన నిందితుడు సైఫ్‌ను ఉరితీయాలంటూ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్, తహసీల్దార్, పోలీసులకు వినతిపత్రం అందజేశారు.

–సాక్షి, నెట్‌వర్క్


అనంతగిరి: కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అఖిల భారత గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాఘవన్‌నాయక్ తదితరులు


బొంరాస్‌పేట: తహసీల్దార్ షర్మిలకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


పరిగి: ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన, ప్రజా సంఘాల నాయకులు


కుల్కచర్ల: ప్రధాన చౌరస్తాలో..


యాలాల: పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న గోర్ సేన నాయకులు

నేటి విద్యార్థులే.. రేపటి శాస్త్రవేత్తలు


స్మార్ట్ ఫ్యాన్ తయారీ విధానాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు (ఫైల్)

సైన్స్ ఎగ్జిబిషన్స్‌తో ఆకట్టుకుంటున్న బాలబాలికలు

- జాతీయ స్థాయిలో రాణిస్తున్న స్టూడెంట్స్
- నేడు జాతీయ వైజ్ఞానిక దినోత్సవం

తాండూరు: ప్రజల జీవన విధానంలో సైన్స్ కీలకంగా మారింది. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు మనిషి జీవితం సైన్స్‌తో ముడిపడుంది. కాలానికి అనుగుణంగా ప్రభుత్వం విద్యా ప్రమాణాల్లో మార్పు తెస్తోంది. దశాబ్ద కాలంగా జాతీయ సైన్స్ దినోత్సవాల పేరిట విద్యార్థుల్లో దాగున్న నైపుణ్యాన్ని వైజ్ఞానిక ప్రదర్శనలతో వెలికి తీస్తున్నారు. మండలం నుంచి జాతీయ స్థాయి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైన్స్ ఎగ్జిబిషన్స్‌తో విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తున్నారు.

జాతీయ స్థాయికి..

భారత భౌతిక శాస్త్రవేత్తగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన డాక్టర్ సీవీ.రామన్‌ను స్మరించుకొంటూ ఏటా ఫిబ్రవరి 28న జాతీయ వైజ్ఞానిక దినోత్సవంగా ప్రకటించారు. నాటి నుంచి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలతో సత్తా చాటుతున్నారు. గతేడాది జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు 9,10వ తరగతి విద్యార్థులను ప్రదర్శన పోటీలు నిర్వహించారు. డిసెంబర్ 7వ తేది నుంచి 9 వరకు జిల్లా స్థాయిలో ప్రదర్శనలు జరిగాయి. ఇందులో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆసక్తి కలిగిన విద్యార్థులు కొత్త ఆలోచనలతో పలు విభాగాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. ఇందులో జిల్లా స్థాయిలో సత్తా చాటిన విద్యార్థుల్లో.. రాష్ట్ర స్థాయిలో 6 మంది ఎంపికయ్యారు. ఈ ఏడాది జనవరి నెలలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. అనంతరం దక్షిణ భారత దేశ వైజ్ఞానిక ప్రదర్శనలు కేరళ రాష్ట్రంలో జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు.

మొబైల్ మైక్రోస్కోప్ ప్రదర్శనతో..

తాండూరు అక్షర పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు సందీప్, అనిరుద్‌లు గైడ్ టీచర్‌లు రవి కుమార్, శ్రీకాంత్‌ల పర్యవేక్షణలో మొబైల్ మైక్రోస్కోప్ తయారు చేశారు. గతేడాది డిసెంబర్ నుంచి మండల స్థాయి నుంచి మొదలైన వైజ్ఞానిక ప్రదర్శనకు మైక్రోస్కోప్‌ను ఎగ్జిబిట్ చేశారు. ప్రయాణాలలో సైతం సూక్ష్మమైన వాటిని కూడా చూసేందుకు మైక్రోస్కోప్‌ను తీసుకెళ్లేందుకు వీలుగా కొత్తగా కనిపెట్టారు. దీంతో జిల్లా, రాష్ట్ర, దక్షిణ భారత దేశ ప్రదర్శనలలో ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చూపారు. త్వరలో జరిగే జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు అర్హత సాధించారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఆసక్తి..

బాల్యం దశలోనే కొత్త రకమైన వస్తువులను కనిపెట్టడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. నీటి వినియోగం ఎంతో కీలకమైనదో వివరించారు. వాటర్ ట్యాంకులు నిండుకోగానే నీరు వృథాకాకుండా అలారం మోగే విధంగా బాలికలు మాధురి, శిరీషలు ప్రదర్శన ఇచ్చారు. అంతే కాకుండా విద్యుత్ వినియోగం తగ్గించేలా స్మార్ట్ ఫ్యాన్‌లను రైల్వే స్టేషన్, ఆసుపత్రుల్లో ఉపయోగించే విధానంపై ఇచ్చిన ఇచ్చారు. ఇలా సరికొత్త ఆలోచనలతో.. వైవిధ్యమైన పరికరాలను కనుగొంటూ గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులు భావి భారత శాస్త్రవేత్తలుగా పుట్టుకొస్తున్నారు.